క్లుప్తంగా

డిజిటల్ లైబ్రరీలను సద్వినియోగం చేసుకోవాలి

ఎంపీడీఓ రాఘవులు



అప్పారెడ్డిపల్లి ప్రభుత్వ పాఠశాల సందర్శించిన ఎంపీడీఓ రాఘవులు

ఆమనగల్లు: గ్రామాల్లో ఏర్పాటు చేసిన డిజిటల్ లైబ్రరీలను విద్యార్థులు, యువకులు సద్వినియోగం చేసుకోవాలని మాడ్గుల ఎంపీడీఓ రాఘవులు కోరారు. మాడ్గుల మండలంలోని దొడ్ల పహాడ్, అప్పారెడ్డిపల్లి గ్రామాల్లో మంగళవారం ఎంపీడీఓ పర్యటించారు. ఆయా గ్రామాల్లో నర్సరీలు, ఉపాధి హామీ పనులను పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. పూలే, అంబేడ్కర్ ఆశయ సాధన సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డిజిటల్ లైబ్రరీని ఆయన పరిశీలించారు. గ్రామాల్లో డిజిటల్ లైబ్రరీల ఏర్పాటు అభినందనీయమన్నారు.

ఇబ్రహీంపట్నంలో ఉచిత వైద్య శిబిరం



బీపీ చెక్ చేయించుకుంటున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: లిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో మంగళవారం ఇబ్రహీంపట్నంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఈ వైద్య శిబిరాన్ని సందర్శించి.. బీపీ పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిషన్‌రెడ్డికి లిమ్స్ వైద్య సిబ్బంది పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసి ఆయన చేత కేక్ కట్ చేయించారు. లిమ్స్ వైద్యులు విశ్వనాథ్, రాంరాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

చింతలపల్లిలో బలగం చిత్ర ప్రదర్శన



బలగం సినిమాను తిలకిస్తున్న చింతపల్లి గ్రామస్తులు

ఆమనగల్లు: మండలంలోని చింతలపల్లి గ్రామంలో మంగళవారం సర్పంచ్ కొప్పు మంజుల ఆధ్వర్యంలో బలగం చిత్రాన్ని ప్రదర్శించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ స్క్రీన్‌పై బలగం సినిమాను ప్రదర్శించారు. చిత్రంలోని కొన్ని సన్నివేశాలకు గ్రామస్తులు కంటతడి పెట్టుకున్నారు.

జాతీయ సదస్సుకు తరలిరండి: ఎమ్మార్పీఎస్



యాచారంలో సమావేశమైన ఎమ్మార్పీఎస్ శ్రేణులు

యాచారం: ఈనెల 17, 18 తేదీల్లో తిరుపతిలో జరిగే ఎమ్మార్పీఎస్ జాతీయ సదస్సుకు సంఘం నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆ సంఘం జిల్లా అధికార ప్రతినిధి సిద్దాపురం శ్రీకాంత్ కోరారు. మండల కేంద్రంలో మంగళవారం ఎమ్మార్పీఎస్ మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సింహ,మహేష్, మహేష్, లింగం, యాదయ్య, జంగయ్య, చంద్రకాంత్, విక్రమ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

పహాడీ షరీఫ్ దర్గాను దర్శించుకున్న కార్తీక్‌రెడ్డి



దర్గాలో కార్తీక్‌రెడ్డి తదితరులు

పహాడీషరీఫ్: పహాడీషరీఫ్‌లోని చారిత్రాత్మకమైన బాబా షర్ఫొద్దీన్ దర్గాను బీఆర్‌ఎస్ యువ నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి మంగళవారం దర్శించుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా దర్గా నిర్వాహకులు ఆయనకు ఆశీస్సులు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కైసర్ బామ్, సయ్యద్ యూసుఫ్ పటేల్, లక్ష్మీనారాయణ, నిరంజన్, అర్జున్, రాజేష్, అబ్దుల్ రవూఫ్, షాకిర్, శ్రీధర్, మన్నాన్ పాల్గొన్నారు.



ఆమనగల్లు: పూలే చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఐక్యతా ఫౌండేషన్ సభ్యులు



ఇబ్రహీంపట్నం: నివాళులు అర్పిస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

యువతకు ఆదర్శం... జ్యోతిరావ్ పూలే

మహాత్మా జ్యోతిరావ్ పూలే జయంతి వేడుకలను మంగళవారం కల్వకుర్తి, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. పూలే విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఉద్యోగ, వివిధ సంఘాల నాయకులు, అభిమానులు మాట్లాడుతూ.. బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి పూలే చేసిన సేవలను ఎనలేనివన్నారు. యువత పూలేను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. – సాక్షి, నెట్‌వర్క్



తలకొండపల్లి: జయంతి వేడుకల్లో సర్పంచ్ కుమార్ తదితరులు



తుర్కయంజాల్: పూలే చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు



హయత్‌నగర్: పూలే చిత్రపటానికి సీపీఐ నేతల నివాళి



కడ్తాల్: యువజన సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో..



ఇబ్రహీంపట్నం: ఎంపీడీఓ కార్యాలయంలో..

నేడు బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం

తలకొండపల్లి: మండల పరిధిలోని చుక్కాపూర్‌లో బుధవారం నిర్వహించనున్న బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని మార్కెట్ కమిటీ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌తో పాటు, నియోజకవర్గ ముఖ్య నేతలు హాజరవుతారని ఆయన పేర్కొన్నారు. మండలంలోని నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు.

వడగళ్ల బాధితులకు పరిహారం ఇవ్వండి: ఎంపీపీ

యాచారం: మంతన్‌గౌరెల్లి గ్రామంలో వడగళ్ల వర్షానికి నష్టపోయిన ప్రజలకు, రైతాంగానికి పరిహారం ఎప్పుడు అందజేస్తారని ఎంపీపీ కొప్పు సుకన్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఆమె మాట్లాడుతూ... 15 రోజుల కింద వడగళ్లు కురిసి గ్రామంలో 500కు పైగా రేకుల ఇళ్లకు రంధ్రాలు పడి దెబ్బతింటే.. రెండు, మూడు రోజుల్లో పరిహారం ఇస్తామని అధికారులు హామీ ఇచ్చి ఇప్పటివరకు ఇవ్వలేదన్నారు. కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని బాధితులకు వెంటనే పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

21న తైబజార్ వేలం

తుర్కయంజాల్: మున్సిపాలిటీ పరిధిలోని తైబజార్ (రోజువారీ మార్కెట్)కు ఈనెల 21న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు కమిషనర్ సాబేర్ అలీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనాలనుకునే వారు ఈనెల 20వ తేదీ సాయంత్రం 5గంటల్లోపు 'కమిషనర్-తుర్కయంజాల్' పేరిట రూ.10వేల డీడీ చెల్లించాలన్నారు. మున్సిపాలిటీకి చెందినవారు మాత్రమే వేలంలో పాల్గొనేందుకు అర్హులని అన్నారు. మరిన్ని వివరాలకు మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

కాలనీల్లో సమస్యలు పరిష్కరించండి

ఎంపీ కోమటిరెడ్డికి తట్టిఅన్నారంవాసుల వినతి

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం తట్టిఅన్నారంలోని పలు కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సంపత్‌రెడ్డి ఆధ్వర్యలలో కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు మంగళవారం ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డిని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హౌసింగ్ బోర్డ్ కాలనీ, లక్ష్మీ గణపతి కాలనీ, హనుమాన్‌నగర్ కాలనీల్లో ఉన్న సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. రాత్రి సమయాల్లో పోలీసుల పెట్రోలింగ్ పెంచాలన్నారు. కాలనీల్లో సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వంటి అభివృద్ధి పనులను పూర్తిచేయాలని కోరారు. హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఓపెన్ జిమ్, చిల్డ్రన్ పార్కు వంటి సౌకర్యాలు కల్పించాలని ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు.



కోమటిరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాలనీ సంక్షేమ సంఘం నాయకులు

, సానుకూలంగా స్పందించిన ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి.. ఏసీపీ పురుషోత్తంరెడ్డికి ఫోన్ చేసి కాలనీల్లో పెట్రోలింగ్ పెంచాలంటూ కోరారు. ఎంపీని కలిసినవారిలో కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు మాధవరెడ్డి, శంకర్‌గుప్తా, శ్రీనివాస్, జైహింద్, గిరి, శ్రీనివాస్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ క్షమాపణ చెప్పాల్సిందే



ఎంపీపీ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఎఫ్‌ఏలు

- ఎంపీపీ కార్యాలయం ఎదుట ఎఫ్‌ఏల నిరసన
- అకారణంగా మహిళను దూషించారని ఆరోపణ

తలకొండపల్లి: పడకల్ సర్పంచ్.. ఓ మహిళను అసభ్య పదజాలంతో దూషించారని.. పద్ధతి మార్చుకోకుంటే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవలసి ఉంటుందని ఫీల్డ్ అసిస్టెంట్‌లు హెచ్చరించారు. మండల పరిధిలోని పడకల్‌కు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ జంగయ్య భార్య పద్మమ్మను ఇటీవల అకారణంగా అదే గ్రామానికి చెందిన సర్పంచ్ రమేష్ అసభ్య పదజాలంతో దూషించారు. తీవ్ర మనస్థాపానికి గురైన పద్మమ్మ పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో మంగళవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఎదుట ఫీల్డ్ అసిస్టెంట్లు నిరసన వ్యక్తం చేశారు. సర్పంచ్ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. సర్పంచ్ వెంటనే క్షమాపణ కోరాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ల మండల అధ్యక్షుడు నర్సింహ, ప్రధాన కార్యదర్శి కృష్ణ, ఉపాధ్యక్షురాలు మంగమ్మ, కోశాధికారి రాములు, వెంకటేశ్, సాల్వయ్య, రామచంద్రయ్య, లక్ష్మీదేవి, నర్సింహ, సత్యనారాయణ, చిన్నారెడ్డి, చంద్రయ్య, బాల్‌చెన్నయ్య, రమణ తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు' దేశానికే ఆదర్శం

- శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
- ఎంపీపీ రఘుమారెడ్డి

మహేశ్వరం: అంధత్వ నివారణ కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన కంటివెలుగు కార్యక్రమం దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎంపీపీ కోరుపోలు రఘుమారెడ్డి అన్నారు. మంగళవారం నాగారం, పెండ్యాల గ్రామాల్లో నేత్ర శిబిరాలను స్థానిక ప్రజాప్రతినిధులు, వైద్యులతో కలిసి ఎంపీపీ ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'కంటివెలుగు'ను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. చూపు సమస్యలతో బాధపడేవారు కంటి పరీక్ష చేయించుకోవాలని, వైద్యుల సూచనల మేరకు కళ్లద్దాలు పెట్టుకోవాలని, మందులు వాడి కంటిపాపను కాపాడుకోవాలని చెప్పారు. ఈ రెండు వైద్య శిబిరాలలో 257 మందికి వైద్యులు పరీక్ష చేశారు. దగ్గర చూపు సమస్య ఉన్న 46 మందికి కళ్లద్దాలు పంపిణీ చేయగా.. మరో 65 మందికి ఆర్డర్ ఇచ్చారు. 12 మందిని శస్త్ర చికిత్స కోసం సరోజినిదేవి కంటి ఆసుపత్రికి రిఫర్ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సునిత, ఎంపీడీఓ నర్సింహ, నాగారం సర్పంచ్ లావణ్య, ఉప సర్పంచ్ ఎండీ లతీఫ్‌ఖాన్, ఎంపీటీసీ వెంకటేశ్, పీఏసీఎస్ చైర్మన్ పాండు యాదవ్, క్యాంప్ మెడికల్ అధికారిణి డా. సౌమ్య, వైద్య సిబ్బంది 108 శ్రీనివాస్, నర్సింహ స్వామి, సువర్ణ, ఏఎన్‌ఎం సువర్ణ, సుగుణవతి, మంగ పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు.



నాగారంలో నేత్ర శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ రఘుమారెడ్డి తదితరులు

బైరాగిగూడ ఉప సర్పంచ్‌పై అవిశ్వాసం

కందుకూరు: మండల పరిధిలోని బైరాగిగూడ ఉప సర్పంచ్ పి.వెంకటేశ్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని కోరుతూ వార్డు సభ్యులు మంగళవారం ఆర్డీఓ సూరజ్‌కుమార్‌కు నోటీసు అందించారు. ఈ సందర్భంగా వార్డు సభ్యులు అందుగుల నరేందర్, గుల్వి పరమేశ్వరి, పల్స అనిత, పండాల మౌనిక, యాచారం మైసయ్య మాట్లాడుతూ...ఉప సర్పంచ్ ఏకపక్ష నిర్ణయాలు, భూకబ్జాలు, ఒంటెద్దు పోకడలతో విసిగిపోయి అవిశ్వాస తీర్మానానికి నోటీసులు అందించామన్నారు.

వెల్జాల్‌లో ఉచిత వైద్య శిబిరం

తలకొండపల్లి: మండల పరిధిలోని వెల్జాల్‌లో మంగళవారం ఉప్పల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఎంపీపీ నిర్మల, ఎంపీటీసీ అంబాజీ, ఉపసర్పంచ్ అజీజ్‌తో కలిసి శిబిరాన్ని ప్రారంభించారు. కాగా శిబిరంలో 382 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్ విండో వైస్ చైర్మన్ రవికుమార్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసమూర్తి, రిటైర్డ్ టీచర్ రామచంద్రరావు, మాజీ ఉప సర్పంచ్ నర్సింహ, నాయకులు.. వెంకటరెడ్డి, అశోక్‌గుప్తా, రాజు, రవీందర్, రాములు, మల్లేశ్, బుచ్చిబాబు, వైద్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం అందజేత

కడ్తాల్: మండల కేంద్రంలో అనారోగ్యంతో బాధపడుతున్న పలువురిని మంగళవారం జిల్లా ఎంపీటీసీల సంఘం గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించారు. మండల కేంద్రంలో అనారోగ్యంతో బాధపడుతున్న మల్లేశ్‌ను పరామర్శించి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5వేలు సాయం అందించారు. అదేవిధంగా అనారోగ్యంతో బాధపడుతున్న వరికుప్పల జంగమ్మను పరామర్శించి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.2వేలు సాయం అందించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, నాయకులు రాజేశ్, యాదయ్య, శ్రీకాంత్, రవి, మహేశ్ తదితరులు ఉన్నారు.

'ఇంటింటికి సీపీఐ' వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

మంచాల: 'ఇంటింటికి సీపీఐ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు యాదయ్య పిలుపునిచ్చారు. మంగళవారం మంచాల మండల పరిధిలోని జాపాల గ్రామంలో ఇంటింటికి సీపీఐ వాల్‌పోస్టర్‌ను స్థానిక నాయకులతో కలిసి యాదయ్య విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏప్రిల్ 14వ తేదీ నుంచి నెలరోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రజా చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు శ్రీశైలంయాదవ్, మండల కార్యదర్శి రాజునాయక్, సహాయ కార్యదర్శి రామకృష్ణ, నాయకులు అలీముద్దీన్, అనంతరెడ్డి, బాలయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

తండాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

జెడ్పీటీసీ దశరథ్‌నాయక్



నిధుల ప్రొసీడింగ్ అందజేస్తున్న దశరథ్‌నాయక్

కడ్తాల్: తండాల అభివృద్ధికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ అన్నారు. రావిచేడ్ పంచాయతీ పరిధిలోని మద్దెలకుంట తండాలో నిర్మించనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు సంబంధించిన రూ.6.5లక్షల ప్రొసీడింగ్‌ను మంగళవారం స్థానిక నాయకులకు దశరథ్‌నాయక్ అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్.. గ్రామాల అభివృద్ధితో పాటు గిరిజన తండాల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు మంజూరుచేస్తున్నారన్నారు. తండాలను పంచాయతీలుగా ఏర్పాటు చేసి వాటి అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గోపాల్, రైతుబంధు గ్రామ అధ్యక్షుడు బాలకృష్ణ, ఉప సర్పంచ్ వినోద్, గ్రామ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రమేశ్, నాయకులు రాజు, ఉపేందర్, రమేశ్, సాయికుమార్, శ్రీను, కృష్ణయ్య, యాదగిరి తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే కిషన్‌రెడ్డికి శుభాకాంక్షల వెల్లువ



ఇబ్రహీంపట్నం: ఎమ్మెల్యే కిషన్‌రెడ్డికి కేక్ తినిపిస్తున్న ఆయన సతీమణి ముకుంద

ఇబ్రహీంపట్నం: బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను మంగళవారం ఇబ్రహీంపట్నం క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. బీఆర్‌ఎస్ శ్రేణులు, అభిమానులు, అధికారులు, ప్రజాప్రతినిధులతో క్యాంపు కార్యాలయం సందడిగా మారింది. గిరిజనుల ఆటపాటలు అలరించాయి. కుటుంబసభ్యులు, పార్టీ శ్రేణులు, ఎంకేఆర్ ఫౌండేషన్ సభ్యులు, బంటి యూత్ ఫోర్స్ సభ్యుల మధ్య ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి కేక్ కట్ చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రులు కేటీఆర్, సబితారెడ్డి, హరీష్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఫోన్‌చేసి మంచిరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్, మంచిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, ఆర్డీఓ వెంకటచారి, ఏసీపీ ఉమామహేశ్వర్‌రావు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఇబ్రహీంపట్నం పాత పోలీస్‌స్టేషన్ ప్రాంతంలో పారిశుద్ధ్య కార్మికులతో కలిసి ఎమ్మెల్యే మంచిరెడ్డి కేక్ కట్ చేశారు. ఈసందర్భంగా మహిళా కార్మికులకు చీరలు, పండ్లు పంపిణీ చేశారు.

దివ్యాంగుడి అభిమానం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీకి చెందిన చాణక్య అనే విద్యార్థి నరాల వ్యాధితో బాధపడుతూ కదలలేని స్థితిలో ఉన్నాడు. ఎమ్మెల్యే కిషన్‌రెడ్డిపై ఉన్న అభిమానంతో స్వయంగా ఆయన చిత్రపటాన్ని గీశాడు. ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా మంగళవారం ఆయనకు బహూకరించి అభిమానం చాటుకున్నాడు. చాణక్యకు అన్నివిధాల అండగా ఉంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

యాచారం మండలం నుంచి..

యాచారం: ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి మంగళవారం ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ శ్రేణులు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను జెడ్పీటీసీ సభ్యురాలు జంగమ్మ, తహసీల్దార్ సుచరిత, ఎంపీడీఓ విజయలక్ష్మి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు రమేష్‌గౌడ్, పాశ్ఛ భాషా, బీఎస్‌ఆర్ ట్రస్టు చైర్మన్ బిలకంటి శేఖర్‌రెడ్డి, నందివనపర్తి మాజీ సర్పంచ్ రాజునాయక్ తదితరులు కలిసి సన్మానించారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్



విందుకు హాజరైన ముస్లింలు

కందుకూరు: ఇఫ్తార్ విందు మత సామరస్యానికి ప్రతీక అని ఆర్యవైశ్య సంఘం యూత్ మండల అధ్యక్షుడు రఘుబాబు గుప్తా అన్నారు. సోమవారం రాత్రి ఆయన మండల కేంద్రంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నవతరం యూత్ అధ్యక్షుడు శివకుమార్, వెంకటేశ్, ఎండీ అజీజ్, అఫ్జల్‌బేగ్, అహ్మద్, సల్మాన్, ముకీమ్‌పాషా, బురాన్ తదితరులు పాల్గొన్నారు.

మండల కేంద్రంలోని మసీదులో..

మండల కేంద్రంలోని మసీదులో మంగళవారం సాయంత్రం కొత్తగూడకు చెందిన బొక్క సురేందర్ రెడ్డి ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. మైనార్టీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎండీ అజీజ్, రఫీక్, పాషా, వసీమ్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు లేకుండా 'పట్టణ ప్రగతి' కార్యక్రమమా?

అధికారులను ప్రశ్నించిన కార్పొరేటర్

ఎల్‌బీనగర్: నిధులు లేకుండా కాలనీల్లో పట్టణ ప్రగతి కార్యక్రమం నిర్వహించడం ఎందుకని బీఎన్ రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ లచ్చిరెడ్డి అధికారులను ప్రశ్నించారు. జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పట్టణ ప్రగతి కార్యక్రమం మంగళవారం డివిజన్ పరిధిలోని ఎస్‌కేడీ నగర్ కమ్యూనిటీ హాల్‌లో జరిగింది. లచ్చిరెడ్డి మాట్లాడుతూ.. కాలనీల్లో అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు కేటాయించకుండా తూతూ మంత్రంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ప్రజలకు ఎలాంటి ఉపయోగం ఉండదన్నారు. కాలనీవాసులు అమరేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి,అధికారులు పాల్గొన్నారు.